

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 17 పుష్యం : 44-45 20-5-2003

RAMANA BHASKARA
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 16
VOL : 8 ISSUE : 16

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260

## సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహభాషణములు, 11-4-03, పాలకోడేరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శ్రీరామనవమి. భారతీయులు ముఖ్యంగా చేసుకొనే పండుగలలో ఇది ఒకటి. వేదాలలో ప్రతిపాదించిన పరమాత్మే రాముడు రూపం ధరించివచ్చిందని, వేదాలసారం రామాయణం అని పెద్దలు చెపుతారు. గాంధీగారికి చిన్నతనంలో ఎక్కువ భయం కలిగేది. నాకు రోజూ భయంవేస్తోంది అని ఒకసారి పనిమనిషితో చెపితే భయం అనే రోగం పోవటానికి ఒక మందు ఉంది, నీవు రామనామం చేసుకొంటూ ఉంటే భయం అనే రోగానికి అదే మందుక్రింద ఉపయోగపడుతుంది, నీవు అభయస్థితిని పొందుతావు అని చెప్పింది. రామనామస్మరణ వలన మోహన్ మహాత్ముడు అయ్యాడు. రక్షించేది రామాయణం అని చెపుతారు. రామనామం నిరంతరం స్మరించటం వలన కామక్రోధములు తగ్గుతాయి. కామక్రోధములు, రాగద్వేషములు తగ్గితేకాని మనకు శాంతి కలుగదు. కోపం తగ్గించుకోవాలి. రోజూ కోపం తెచ్చుకొంటూఉంటే మన హృదయంలో ఉన్న శాంతికి, ఆనందానికి మనం దూరమయిపోతాము. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా రామచంద్రమూర్తి ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవాడు. నీవు వనవాసానికి వెళ్ళు అని చెప్పినా, రేపు సింహాసనం అదిష్టించు అని చెప్పినా ఆమాట, ఈమాట కూడా సమానంగా తీసుకొంటాడు వాడు రామచంద్రమూర్తి. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే మీరు తొందరపడిపోతారు, మిమ్మల్ని మీరు సమర్థించుకోవటానికి ప్రయత్నం చేస్తారు. రాముడు తనను తాను సమర్థించుకోవటానికి ఏమి ప్రయత్నం చేయడు, అందుకే ఆయన దేవుడు అయ్యాడు. మీ అత్తగారు మిమ్మల్ని ఏదైనా ఒకమాట అంటే నవ్వేసి వదిలేస్తే ఏమీలేదు, కాని మిమ్మల్ని మీరు సమర్థించుకోవటానికి పెద్దకష్టపడిపోతారు. రామాయణంలో విభీషణ శరణాగతి ఒకటి ముఖ్యమైనది, అది మనం నేర్చుకోవాలి. రావణాసురుడు విభీషణుడికి అన్నగారు, కాని ధర్మం అన్నగారి వైపు లేదు, ధర్మం రాముడివైపు ఉంది. అన్నగారివైపు ఉండాలా, ధర్మం వైపు ఉండాలా ఆపరిస్థితి ఎంతకష్టమో చూడండి, ఆయన ధర్మం వైపు ఉండి, భగవంతుడికి శరణాగతి పొందాడు. ఆపరిస్థితి మనకు వస్తే మనం ఫెయిలైపోతాము. విభీషణశరణాగతి దీర్ఘశరణాగతి. ఇక్కడ గ్రహించవలసింది ఏమిటి అంటే అన్నగారికి చెప్పవలసిన మంచిమాటలు చెప్పాడు కాని అన్నగారు వినలేదు. ఈయన ధర్మాన్ని విడిచిపెట్టకుండా ధర్మపక్షాన్ని ఆశ్రయించాడు. ధర్మానికి, అధర్మానికి పోరాటం వచ్చినప్పుడు మనం ధర్మాన్ని విడిచిపెట్టకూడదు. కొంతమంది అల్పబుద్ధులు ఉంటారు, రాజ్యంకోసం విభీషణుడు రాముడిని ఆశ్రయించాడు అంటారు. అది మన బుద్ధిలో ఉన్నదోషం, విభీషణుడి బుద్ధిలో ఉన్న దోషంకాదు. ధర్మాన్ని ఆచరించటం కోసం విభీషణుడు రాముడి పాదాలను ఆశ్రయించాడు కాని రాజ్యం సంపాదించాలనే కోరిక అతనికి లేదు. మామూలుగా రాజ్యం వచ్చింది అంతేగాని కోరికతో తెచ్చుకోవటం కాదు. మనకోరిక లేకుండా వచ్చింది మనలను బంధించదు, కోరికతో తెచ్చుకొన్నది బంధిస్తుంది. జ్ఞానులు అంటే మొద్దులు అనుకోవద్దు జ్ఞానంలో అనంతమైన శక్తి, ఆనందం ఉంటుంది. ఆ ఉపాధి ద్వారా ఆనందం, శక్తి సమాజానికి అందుతూ ఉంటుంది. నాకు బాహ్యజీవితానికి ధశరధ కుమారుడు రాముడు ఆదర్శము. ఆరాముడిని ఆదర్శంగా పెట్టుకొని జీవిస్తూ ఆత్మారాముడి దగ్గరకు వెళ్ళాలి, అప్పుడు కదా జీవితయాత్ర పూర్తి అయ్యేది అనే వారు గాంధీజీ. జీవుడు, దేవుడు అంటున్నారు, జీవుడి హృదయంలో దేవుడు ఉన్నాడు కదా. ఆజీవుడిని చూసే బదులు లోపలఉన్న ఈశ్వరుడిని చూడవచ్చుకదా అంటున్నారు భగవాన్. మీరు మంచుగడ్డను, మంచుగడ్డగానే చూస్తున్నారు కాని అందులో ఉన్నదంతా నీరేకదా. నీరే మీకు గడ్డక్రింద కనిపిస్తోంది. మీరు గడ్డను చూస్తున్నారు కాని నీరును చూడటంలేదు. జీవుడు ఎవరు అంటే లోపలఉన్న ఆత్మ యొక్క అంశే నీకు జీవుడిగా కనిపిస్తోంది. మనం నామరూపాలను చూస్తున్నాము గాని ఈ నామరూపములతో వచ్చిన జీవకోటి అంతా పరమాత్మ యొక్క అంశే అని నీకు అర్థమయితే, నీవు మంచుగడ్డను కాకుండా దానిలో ఉన్న నీరును చూస్తూఉంటే అలాగే ఇక్కడ నామరూపములతో కనిపిస్తున్న జీవకోటిని కాకుండా అందరిలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను చూస్తూఉంటే నిగ్రహించుకోవటానికి మనస్సు ఎక్కడ ఉంది అన్నారు భగవాన్, అంటే మీరు అందరూ మోక్షసుఖాన్ని అందుకొంటారు.

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

11-4-03 పాలకోడేరు ........ 1
15-4-03 తాడేపల్లిగూడెం ........

అరణ్యవాసంలో రామచంద్రమూర్తి అనేకమంది మహాత్ములను, మహర్షులను ఈయనే స్వయంగా వెళ్ళి దర్శనం చేసుకొనేవాడు. సత్పురుషులను, సహృదయం ఉన్న వారిని దర్శించడం, వారిని గౌరవించటం మనం నేర్చుకోవాలి, దానివలన మనకు నష్టం ఏమీ లేదు, మనం లాభం పొందుతాము. మనం దేనినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నామో దానిని మర్చిపోవాలి. రాముడిలాగ జీవించేవాడికి అహంభావన దానంతట అదే నశిస్తుంది. ప్రపంచాన్ని చూసి నీవు పారిపోవద్దు, ప్రపంచాన్ని పేస్ చెయ్యి అంటారు స్వామీజీ. భగవాన్ ఏమంటారు అంటే అసలు ఫేస్ చెయ్యటానికి లోకం అంటూ ఒకటిఉంటే కదా అంటారు నువ్వుఫేస్ చేయటానికి అసలు లోకం అంటూలేనేలేదు అంటే అది నిష్ప్రపంచస్థితి. ఈశ్వరునియొక్క అంశ లేకుండా ఏరూపమూ ఈసృష్టిలోనికి రాదు. ఉన్నదంతా చైతన్యమే, ఉన్నదంతా భగవంతుడే. దానికి భిన్నంగా నీకు ఏదైనా కనిపిస్తూ ఉంటే అది నీగందరగోళం, నీ అజ్ఞానం తప్పించి ఏమీలేదు. మనం ఏదైనా మాట్లాడేటప్పుడు ఎదుటివారు అందరూ మొద్దులు అని అనుకోకూడదు, ఎదుటివారికి కూడా తెలివితేటలు ఉంటాయి అనుకొని మాట్లాడాలి. ఎదుటివారుకూడా తెలివైనవారు అనుకొని మనం మాట్లాడితే మనం ప్రమాదంలో పడము. ఎదుటివారు అందరూ తెలివితక్కువవారు అనుకొని మనం మాట్లాడితే వారు తెలివిగలవారు అనుకోండి మనం ప్రమాదంలో పడతాము. ఎవరైనా ఏదైనా చెపుతున్నారు అనుకోండి ఇందులో ఎంతవరకు సత్యం ఉంది, ఎంతవరకు సత్యంలేదు, ఇందులో మనం నేర్చుకోవలసింది ఏమిటి మనకు పనికిరానిది ఏమిటి అని మీ సొంతఆలోచనను, వివేకాన్ని పెంచుకోవాలి. జ్ఞానమార్గంలో వివేకం చాలాముఖ్యం. ఎవరైనా ఏదైనా చెపుతూ ఉంటే వినవచ్చు. జాగ్రత్తగా విన్న దానిని అర్థం చేసుకొని, విశ్లేషణ చేసుకొని మీకు అవసరం అయిన దానిని తీసుకొని, అవసరం లేనిది వదిలేయాలి. ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు మన మాట వారికి శాంతిని కలుగజేయాలి, వారి చైతన్యస్థాయి పెరగటానికి మనమాట సహకరించాలి దాని వలన మనం ఈశ్వరుని దయకు పాత్రులవుతాము, జ్ఞానానికి వారసులమవుతాము.

మనం భగవంతుడి కంటే వేరుగా లేము కాని వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము నిజంగా ఆయనకంటే వేరుగా ఉంటే వేరుగా ఉన్నాము అనుకొన్నా ఇబ్బంది లేదు. మనం భగవంతుడిలోనే ఉన్నాము, అది మనకు అనుభవంలోనికి వస్తే ఇంకేమీలేదు, అదే జ్ఞానం. మేము లోకానికి సేవచేయాలి అని కొంతమంది అంటూఉంటారు. లోకం మీ కంటే భిన్నంగా ఉందా, లోకంలో నీవు ఒక భాగమే. లోకంలో నుండి విడిపోవటం ఎందుకు? లోకానికి సేవచేయాలి అని అనుకోవటం ఎందుకు? నువ్వు పవిత్రుడవు అయితే,నీకు జ్ఞానం కలిగితే నీద్వారా జరగవలసింది ఏదో లోకానికి జరుగుతుంది, అది ఆటోమేటిక్‌గా జరుగుతుంది, నీవు అనుకోవటం కాదు. మనకు నేను అనే తలంపు ఉంది అది దేహంతో, మనస్సుతో కలిసి కలుషితమైంది. దేహగతమైన నేనుకు లోపల, బయటబుద్ధి ఉంది గాని

20-5-2003

చైతన్యానికి ఇది ఏమీలేదు, ఉన్నదంతా అదే. మీకు గందరగోళంగా ఉంటే, అశాంతిగా ఉంటే దానికి మీరు ఎవరో మీకు తెలియకపోవటమే కారణం. మీలో ఏదైనా మంచి ఉంటే దానిని కొంచం పెంచుకోండి. కొంతమందికి పుట్టుకతోనే నెగిటివ్ బుద్ధులు ఉంటాయి, వారు బాగుపడరు ఇతరులను బాగుపడనివ్వరు, అటువంటి సహవాసాలు చేయవద్దు. ఆస్వభావాన్ని మార్చుకోవడం చాలా కష్టం, దానికి ఎంతో సాధన ఉండాలి. సాధన అంటే ఏమీలేదు మన స్వభావంతో మనం పోరాడటం, మన బలహీనతలతో మనం పోరాడటమే సాధన. మనకు ఆత్మజ్ఞానం కలుగకుండా మనలో ఏబలహీనతలు అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటమే సాధన యొక్క ప్రయోజనం. పూజ, జప, ధ్యానముల యొక్క ప్రయోజనం అంతవరకే. నువ్వు ఏదిగా ఉన్నావో దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నిజమైన జ్ఞానం. వారిని వారు నిరంతం రక్షించుకోవాలనుకొనేవారు వారిని వారు పోగొట్టు కొంటారు, వారిని వారు పోగొట్టుకోవాలనుకొనేవారు రక్షింపబడతారు అని ఏసు చెప్పారు. దొంగనేనును పోగొట్టుకోవడం మాట అటు ఉంచండి, కొంతమంది ఈ దొంగనేనును ఎలా కాపాడుకోవాలి, దానిని ఎలా రక్షించుకోవాలి అని నిరంతరం చూస్తూఉంటారు. ఈ దొంగనేనును రక్షించుకోవాలి అనుకొనేవారు చివరకు సున్న అవుతారు, వారిని వారు పోగొట్టుకొన్న వారందరు ఈశ్వరసామ్రాజ్యానికి అధిపతులు అవుతారు, నిర్వాణస్థితిని పొందుతారు. భక్తులు కాని వారిమాట వదిలి వేయండి, భక్తులుకూడా భక్తిపేరు మీద ఈ దొంగనేనును ముస్తాబు చేసుకొంటున్నారు. మిమ్మల్ని ఎవరైనా చెడ్డవారు అంటారు అనుకోండి మేము మంచివారము, మేము మంచివారము అని పదిసార్లు అంటాము, మనలను మనం డిఫెండ్ చేసుకోవటానికి ప్రయత్నం చేస్తాము, అది ఒక బలహీనత. గాంధీగారిని ఎవరైనా నీవు మహాత్ముడవు కాదు అంటే నేను మహాత్ముడను అని డిఫెండ్ చేసుకోవటానికి, ఆర్గ్యుమెంట్ ఏమీ చెప్పరు, అలా చెప్పవలసిన పని ఆయనకులేదు. అది వారి హుందాతనానికి గుర్తు. వారికి ఉండే జ్ఞానబలం, లోపల తీవి వారికి ఉంటుంది. ఇటువంటి పొడిపొడి మాటలకు, చిరుగాలికి కంగారుపడరు. ఇప్పుడు మనకు ఉన్నది మిధ్యాజ్ఞానం, ఆత్మజ్ఞానంకాదు. మిధ్యాజ్ఞానం వలన పొట్టవెళుతుంది కాని మనకు సత్యానుభవం కలుగదు. మనం ఏదిగా ఉన్నమో అది తెలియకపోవటం ఒక పొరపాటు అది తెలియకపోయినా ఇబ్బంది లేదు మనం ఏదైతే కాదో అదే మనం అనుకొంటున్నాము. మనం కాని శరీరాన్ని, మనం కాని మనస్సును మనం అనుకొంటున్నాము. ఇవి అన్నీ యాక్సిడెంట్లే. పెళ్ళికూడా ఒక యాక్సిడెంట్. వీటిలోనుండి మనం తప్పించుకోవటానికి ప్రయత్నం చేసినా యాక్సిడెంట్‌లో పడిపోతున్నాము. సత్యం మన హృదయంలో ఉంది. అది మనకు తెలియకపోయినా, అది తెలిసినవారు ఎవరైనా ఉంటే వారితో సహవాసం చెయ్యండి, అదే సత్పురుషులసహవాసం. సత్పురుషుల సహవాసం కోసం అవసరమైతే భూమియొక్క అంచులదాక ప్రయాణం చేయండి అని ఐన్‌స్టీన్ చెప్పాడు.

రమణ భాస్కర

సత్పురుషులతో సహవాసం చేయటం వలన, మహాత్ములతో సాంగత్యం వలన మీకు తెలియకుండానే మీలో ఉన్న అవిద్య నెమ్మదిగా నశిస్తుంది. మీకు ఏ కారణం వలన అశాంతి వచ్చినా, టెన్షన్ వచ్చినా లోపల అజ్ఞానం ఉంది అని గుర్తు. లోపల అజ్ఞానం లేకపోతే ఏ మనిషికి గందరగోళం రాదు, అశాంతి రాదు. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. ఈ వాక్యం బాగాగుర్తుపెట్టుకోండి. భూకంపాలు వచ్చినా, గాలివానలు వచ్చినా అవి ఈశ్వరుడికి తెలియకుండా రావటం లేదు అలాగే మీ జీవితంలో ఏసంఘటన జరిగినా అది ఈశ్వరుడికి తెలియకుండా జరగటంలేదు. అంతా ఈశ్వర సంకల్పంతోనే నడుస్తోంది. అది తెలిస్తే మీకు సుఖం, తెలియకపోతే దుఃఖం. అసలు ఉన్నదే ఈశ్వరుడు, మనం లేనేలేము ఈవాక్యం బాగా మననం చేసుకోండి. అంతా ఈశ్వరసంకల్పం తోనే నడుస్తుంది. అది మనకు ఇష్టంఉన్నా, ఇష్టంలేకపోయినా ఆయన సంకల్పం ప్రకారమే అంతా నడుస్తుంది. ఈశ్వరసంకల్పాన్ని అంగీకరించినవాడు సుఖిఅవుతాడు, ఈశ్వర సంకల్పాన్ని ఎవడైతే అంగీకరించడో వాడికి దుఃఖం పెరగటమేకాదు, వ్యక్తిభావన పెరుగుతుంది. నీలోపల ఒక చావులేని పదార్థం ఉంది, దానికి శరీరానికి ఎటువంటి సంబంధంలేదు. నీ శరీరాన్ని కాల్చినప్పుడు అది కాలదు. అది నీకు అందటం లేదు కాబట్టి అది లేదు అని అనుకోవద్దు. అది అందినవారితో సహవాసంచేయటం వలన అదిమీకు అందటానికి వారు సహాయ సహకారములు అందిస్తారు.

తలంపులు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. తలంపులగురించి మీరు కంగారు పడవద్దు, అవిమీరు కాదు. లోపల వాసననుబట్టి ఆ తలంపులు వస్తూఉంటాయి. ఆతలంపులతో తాదాప్యం పొందవద్దు. ఆతలంపులతో తాదాప్యం పొందకుండా ఉంటే అవివాడిపోయి రాలిపోతాయి. మొక్కకు నీరు పోయకపోతే ఆది చనిపోతుంది. దానిని ప్రత్యేకం చంపనక్కరలేదు, అదే చనిపోతుంది. అలాగే మీకు తలంపులు వస్తూఉంటే వాటితో తాదాప్యంపొందకండి, అవేవాడిపోయి, రాలిపోతాయి. మన స్వరూపం యొక్క మరుపు ఒక యాక్సిడెంట్, మనం ఏదైతే కాదో అది అవుననుకోవటం ఇంకో యాక్సిడెంట్ మనకు ఎఛీవ్‌మెంట్లు లేకపోయినా చివరకు యాక్సిడెంట్లు మిగులుతున్నాయి. మీ బ్యాంక్‌లో ఉన్న డబ్బుకంటే మీ జేబులో ఉన్న డబ్బు ఎప్పటికప్పుడు ఉపయోగపడుతుంది. మీ జేబులోఉన్న డబ్బు ఎటువంటిదో మీకు జ్ఞాపకం ఉన్నమాటలు అటువంటివి. కొన్ని ముఖ్యమైన మాటలు గుర్తుపెట్టుకోవాలి. కొన్ని సంఘటనలు మనం మర్చిపోదామనుకొన్నా మర్చిపోలేము అలా దేవుని వాక్యాలు గుర్తుండాలి. దేవుని వాక్యం దేవుడై ఉన్నది. సముద్రంపైన కెరటాలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి. కాని సముద్రంలోతులో ఉన్నవాడికి ఆకెరటాలతో సంబంధంలేదు, ఆకెరటాల ప్రభావం వాడిమీద ఉండదు అదేవిధంగా నీవు హృదయగుహలోనికి వెళితే, నీవు ఏదిగా ఉన్నావో దాని తాలుక స్పర్శ నీకు దొరికితే తలంపుల యొక్క ప్రభావం నీమీద ఉండదు, రాగద్వేషముల ప్రభావం కూడా ఉండదు. రాముడు



దేహం చనిపోతోంది అనుకోండి నేను చనిపోతున్నాను అని ఆయన అనుకోడు, అలా అనుకొంటే ఆయన దేవుడేకాదు. రాముడికి ఒక నేను ఉంది కాని అది దేహరహితమైనది. దేహరహితమైన నేను దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని అనుకోదు. మనది దేహరహితమైన నేను కాదు, అది దేహంతో మనస్సుతో కలుషితమై ఉంటుంది. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని ఎందుకు అంటుంది అంటే అది దేహంతో కలిసి ఉంటుంది. ఆ నేనులోనుండి విడుదలపొందటానికే భక్తియోగం, కర్మయోగం, జ్ఞానయోగం. మీదేహయాత్ర నడవటానికి మీ పని మీరు చేసుకోండి. ఇతరులమీద ఆధారపడితే బానిసత్వంవస్తుంది. జ్ఞానమార్గంలో వివేకం యొక్క అవసరం మరీ ఎక్కువగా ఉంటుంది. ఎందుచేతనంటే అది విమానప్రయాణం. సత్పురుషులతో సంబంధం వలన నీకు ఆధ్యాత్మికఅనుబంధం కలుగుతుంది. ఆధ్యాత్మిక అనుబంధం వలన నీకు ఆత్మానుభవం కలుగుతుంది. ఈమధ్య ఒక ముసలాయన చనిపోతూ అమ్మని బాగాచూడు అని వాళ్ళ అబ్బాయితో చెప్పాడు. అప్పుడు అబ్బాయి బాగా చూస్తాను అనిచెప్పలేదు, అమ్మతిన్నాకే నేను తింటాను అన్నాడు. బాగా చూస్తాను అని ఇంక ప్రత్యేకంగా చెప్పటం ఎందుకు. చేసేవారు ఎక్కువగా చెప్పరు, ఎక్కువ చెప్పవలసిన పని వారికి లేదు. మనయజమాని, మన ప్రభువు మన హృదయంలోనే ఉన్నాడు. ఇప్పుడు మనం ప్రపంచంతో కలిసి ఉంటున్నాము. మనం ట్రైనింగ్ లేకుండానే ప్రపంచాన్ని చూడటం నేర్చుకొన్నాము. ఇప్పుడు మనం ప్రపంచాన్ని ఎంత సహజంగా చూస్తున్నామో నీలోపల ఉన్న ఈశ్వరుడిని అంత సహజంగా చూడటం నేర్చుకోవాలి, అది సాధనఅంటే, దానికి ట్రైనింగ్ అవసరం. ఈమధ్య అరుణాచలంలో నాకు ఒక అబ్బాయి కనిపించాడు. మీ పొరుగువారు రోజూ నిన్ను తిడుతూ ఉంటారట మరి ఎందుకు ఊరుకొంటున్నావు అని అడిగాను. నేను మీరు అనుకొన్నంత అమాయకుడ్ని కాదు, నాకు చేతకాక ఊరుకోవటంకాదు, ఎందుకుఊరుకొంటున్నాను అంటే నా పాపాలన్నీ వారికి పోతాయని ఊరుకొంటున్నాను, ఎరుకతోటి ఊరుకొంటున్నాను అని చెప్పాడు, పైగా ఈ మాటలు టెన్షన్‌తో చెప్పటం లేదు, నవ్వుతూ సంతోషంగా చెప్పాడు. మీరు అసలు పుట్టలేదు అన్న సంగతి మీకు తెలిసినప్పుడు మీకు ఆభవసుఖం, పూర్ణసుఖం, ఆత్మసుఖం మీకు అందుతుంది. అది అలౌకికము, అభౌతికము, అది ప్రపంచంలో ఉన్న సుఖాలతో పోల్చటానికి వీలులేనిది. అందులో వెలితి ఉండదు, కొరత ఉండదు, అది స్వతంత్రమైనది. ఇప్పుడు మనంలోకంలో అనుభవించే సుఖాలన్నీ కూడా పరిణామంలో దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. కొంతమంది ధనం ఉన్నా భోగం అనుభవించరు ఎందుకయ్యా ధనం ఉంది కదా భోగం అనుభవించవచ్చుకదా అంటే ఆభోగం రోగం క్రింద మారుతుంది అంటారు. మనం పూర్వజన్మలో అనుభవించిన భోగాలే ఈజన్మలో రోగాల క్రింద వస్తాయి, ఈజన్మలో అనుభవించే భోగాలు రాబోయే జన్మలో రోగాల క్రింద వస్తాయి. పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు తిరిగి

పుడతాడు. సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు, చావుపుట్టుకలే సంసారం. అందులోనుండి విడుదలపొందటానికి, ప్రకృతిలోనుండి విడుదలపొందటానికి నీకు సహాయసహకారములు అందించేవాడే సత్పురుషుడు. తల్లితండ్రులు మీకు అన్నం పెడతారు, బట్టలు ఇస్తారు ఒక్క గురువు మాత్రమే మీకు జ్ఞానాన్ని ఇవ్వగలడు, మిమ్మల్ని సఖిపెట్టేది జ్ఞానము మాత్రమే. మీకుపుణ్యప్రారబ్ధం ఉంటే, పుణ్యబలం ఎక్కువగా ఉంటే జ్ఞానులే మీ దగ్గరకు వస్తారు. ఒకవేళ అలా రారు అనుకోండి వారికోసం వెతుక్కోండి, జ్ఞానం కోసం వెతకండి. మాకు శాంతి లేదు అని చాలామంది చెపుతూ ఉంటారు మనకు శాంతి లేకపోవడానికి మనం కల్పించుకొన్న గొడవలే కారణం, ఈశ్వరసంకల్పం మీద గౌరవం లేకపోవటమే కారణం. మీరు పూజలు చేసినా, జపాలు చేసినా, ధ్యానాలు చేసినా రాగద్వేషాలను విడిచిపెట్టకపోతే మీకు శాంతి కలుగదు. మీరు చేస్తున్న శరణాగతి నిజం అనుకోండి శరణాగతి వలన కూడా మీకు శాంతి కలుగుతుంది. ఎక్కడ శరణాగతి ఉంటే అక్కడ శాంతి ఉంటుంది. దేహంతో తాదాప్యం పొందే నేనే మూలతలంపు. నీకు బాహ్యకారణం వలన వచ్చే దుఃఖం కంటే మూలతలంపే ఎక్కువ దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. ఆ మూలతలంపు నశించినప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది, అప్పుడు రాకపోకలతో నీకు పనిలేదు. ఈమధ్యన అరుణాచలంలో ఒకరింటికి భోజనానికి వెళ్ళాము. రేపు అరుణాచలం విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాము అని చెప్పాను. మీరు అరుణాచలాన్ని విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళిపోతారు. అరుణాచలాన్ని విడిచి వెళ్ళిపోతే మీరు నాన్నగారు ఎలా అవుతారు. ఒకవేళ మీరు అరుణాచలాన్ని విడిచి వెళ్ళిపోయినా నాన్నగారు అరుణాచలంలో లేరు అని మేము అనుకోవటంలేదు, అలా అనుకోవటానికి మేము బొత్తిగా అమాయకులం కాదు అంటోంది.

దేహముతో తాదాప్యం పొందే తలంపే దెయ్యం. ఆ దెయ్యం అప్పడప్పడు దేవుడి గురించి మాట్లాడుతుంది, అది ముఖ్యం కాదు, దెయ్యం ఏమిచెప్పినా అది నిజంకాదు. ముందు ఆ దెయ్యాన్ని పోగొట్టుకోండి. దేవుడిని తెలుసుకొంటాను అని ఒకోసారి అహంభావన చెపుతూ ఉంటుంది కాని అందులోనుండి అది బయటకు రాదు. భగవంతుడి కంటే నేను భిన్నంగా ఉన్నాను అనే బేధబుద్ది వేరుతో సహానశిస్తే గాని నీకు జ్ఞానోదయం కలుగదు. సబ్జక్టు బాగా అర్ధం చేసుకొంటే మీరు సుఖపడతారు. మీరు కానిదానితో మీకు తాదాప్యం పోతే బాహ్యపరిస్తితులు ఎలా ఉన్నా, ఒక వేళ మిమ్మల్ని దురదృష్ణం వెంటాడుతూ ఉన్నా మీకు దుఃఖంరాదు. మీరు అందరూ తెలివైనవారే, మీ తెలివితేటల్ని ఉయోగించుకొని ఆత్మజ్ఞానాన్ని పొందలేకపోతే ఆ తెలివిని ఏమి చేసుకొంటారు అంటున్నారు శారదామాత. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొని, మీ లోపలఉన్న సద్వస్తువుతో తాదాప్యం పొందటం నేర్చుకోండి. భగవంతుడు ఇచ్చిన అవకాశములను బాగా ఉపయోగించుకొంటే మీకు వెంటనే జ్ఞానం కలుగకపోయినా, జ్ఞానసముపార్జనకు



అనుకూలమైన జన్మ వస్తుంది. భగవంతుడికి భక్తుడు అంటే పరమప్రీతి. మనం భక్తులను గౌరవిస్తున్నాము అనుకోండి, భక్తులను ప్రేమిస్తున్నాము అనుకోండి మనలనే గౌరవిస్తున్నారు అని భగవంతుడు అనుకొంటాడు. మనం పదిమందిలో ఉన్నప్పడు మనం ఎటువంటి వారమో మనకు తెలియదు, ఏకాంతంగా ఉన్నప్పడు మన గురించి మనకు తెలుస్తూ ఉంటుంది. జ్ఞానం అంటే ఏమిటి అంటే అంతా ఈశ్వరుడే, నీకు కష్టం వచ్చినా ఈశ్వరుడే, సుఖం వచ్చినా ఈశ్వరుడే, పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా ఈశ్వరుడే, ఒకవేళ నీకు వ్యతిరేకంగా ఉన్నా ఈశ్వరుడే. ఈశ్వరుడు తప్పించి ఏమీ లేదు అని నీవు గుర్తించాలి, గుర్తించిన దానిని గ్రహించి మననం చేసుకొని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అది జ్ఞానం. ఈశ్వరుడు తప్పించి ఏమీ లేదు, ఏదో ఉందని నీవు అనుకొంటున్నావు కదా అదే అజ్ఞానం. సముద్రం ఉంటే బుడగ ఉంది, సముద్రం లేకపోతే బుడగలేదు. చైతన్యం ఉంటే నేను ఉన్నాను, నీవు ఉన్నావు, లోకం ఉంది. చైతన్యం లేకపోతే ఏదీలేదు. బుడగను నీవు పేల్చేయనక్కరలేదు, బుడగతో తాదాప్యం పొందవద్దు, బుడగగా రూపందాల్చింది కూడా నీరే అందుచేత బుడగను చూసేటప్పడు కూడా నీరును చూడటం నేర్చుకోండి అలాగే ఈ లోకాన్ని చూసేటప్పడు కూడా దానికి ఆధారంగా ఉన్న చైతన్యాన్ని చూడు నీవు సుఖంలో ఊగిసలాడతావు, ఆత్మజ్ఞానానికి అధిపతులవుతారు. తాడు నీకు పాములాగ ఎలా కనిపిస్తోందో అలాగ ఈశ్వరుడు నీకు జగత్తు, జీవుడుగా కనిపిస్తున్నాడు. ఉన్నది ఒక్కటే వస్తువు. జగత్తులేదు. జీవుడు లేడు, వూరికే ఉన్నట్లు కనిపిస్తోంది. తాడు తాడుగా నీకు కనిపించినప్పడు పాములేదు, మరి పాముగా కనిపించినది ఏమయ్యింది అంటే తాడులో కలిసిపోయింది. నీకు ఏప్పడైతే జ్ఞానం కలిగిందో నీ చేత చూడబడుతున్న ఈ ప్రపంచం అంతా కూడా నీలో ఐక్యమయిపోతుంది. నువ్వు కర్మమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞాన మార్గంలో ప్రయాణం చేసినా, భక్తిమార్గంలో ప్రయాణం చేసినా ఈదొంగనేనులో నుండి విడుదలపొందటానికి ప్రయత్నం చెయ్యి. ఏ నేను అయితే దేహంతో, మనస్సుతో తాదాప్యం పొంది కలుషితమవుతోందో ఆ కలుషితమైన నేనులో నుండి విడుదలపొందటానికి ప్రయత్నం చెయ్యి. మీకు ఇష్టమైన మార్గంలో మీరు సాధన చేసుకోవచ్చు కాని దేహగతమైన నేనులో నుండి విడుదలపొందటమే మీ సాధన యొక్క గమ్యం.

మారీచుడిని చంపటానికి రాముడు వెళ్ళినప్పడు మారీచుడు రాముడు వేసినట్లుగా కేకలు వేస్తాడు. రాముడు చనిపోతున్నాడేమో అనుకొంది సీతమ్మ. రాముడి గురించి భయపడనక్కరలేదు అని లక్ష్మణుడు చెప్పినా అది వినకుండా లక్ష్మణుడిని అనేక పరుషవాక్యాలు మాట్లాడుతుంది. అప్పడు లక్ష్మణుడు ఒకరేఖగీసి ఎవరైనావచ్చినా అది దాటవద్దని సీతకు చెప్పి వెళతాడు. రావణాసురుడు సన్యాసివేషంలో వచ్చి భిక్ష అడుగుతాడు. ఆరేఖలోపలఉండే భిక్షవేయబోతుంది సీతమ్మ. రావణాసురిడికి ఆరేఖ దాటేశక్తిలేదు అప్పడు ధర్మం చెపుతాడు రేఖ దాటివచ్చి భిక్షవేయాలి అని చెపుతాడు. సీతమ్మకు ఏగతిపడుతోందో

ఇక్కడ మీరు అర్థం చేసుకోండి. అది ఈశ్వరసంకల్పం. లక్ష్మణుడు చెప్పినది సడన్‌గా మర్చిపోయింది, నిజమే సన్యాసులకు రేఖదాటి భిక్షవేయాలికదా అనుకొంది, గబుక్కున రేఖదాటి బయటకు వచ్చింది. అది సీతమ్మ తెలివితక్కువతనంకాదు. అది ఈశ్వరసంకల్పం. ఏమిటి సీతమ్మ ఇలా చేసింది అని మనం అనుకోవచ్చు కాని అక్కడ పని చేసింది ఎవడు? ఈశ్వరుడు. ఈశ్వరుడి ఆజ్ఞను మనం అతిక్రమించలేము. ఆమరపురావటానికి, రేఖ దాటటానికి కారణం ఈశ్వర సంకల్పం అది మర్చిపోకండి. అక్కడ సీతమ్మలేదు, లక్ష్మణుడులేడు, మీరు లేరు అక్కడ ఉన్నవాడు ఎవడు? ఈశ్వరుడు. సీతమ్మను ఆడించినవాడు ఎవడు? ఈశ్వరుడు అది మర్చిపోకూడదు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 15-4-03, తాడేపల్లిగూడెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం దేవాలయాన్ని ఉపయోగించుకోవాలి. భగవంతుడి సన్నిధానంలో ఉన్నప్పడు మనకు నిర్మలత్వం వస్తుంది, నిశ్చలత్వం వస్తుంది, ఏకాగ్రతకలుగుతుంది. దేహమేనేను అనుకొన్నంతకాలం, దేహమేఆత్మ అనేబుద్ధి ఉన్నంతకాలం ఏదో ఒక దేవతావిగ్రహాన్ని ఆరాధించి, ఏకాగ్రత సంపాదించుకొని, పవిత్రులం అయ్యి మనంతరించాలి. అందుకే మన పూర్వీకులు దేవాలయాలు నిర్మించారు. ఉన్నది ఒక్కటే సత్యం, అదే బ్రహ్మం, ఆబ్రహ్మం ఒక దేవతకాదు, కాని దేవతలు ఆబ్రహ్మంను విడిచిపెట్టిలేరు. మనం ఏదేవతను ఆరాధించినా ఆమొఖం ద్వారా బ్రహ్మంను పొందాలి. మనకు బ్యాంక్‌ను చూస్తే డబ్బు ఎలా జ్ఞాపకం వస్తుందో అలాగే దేవాలయాలను చూస్తే భక్తి జ్ఞాపకం వస్తుంది. సత్పురుషుల సహవాసం విడిచిపెట్టవద్దు అని మనపెద్దలు చెప్పారు. సత్పురుషులతో సహవాసం వలన మనకు మంచి ఆలోచనలు వస్తాయి, మంచితలంపులు వస్తాయి, జీవిత నడవడిక మంచిగా ఉంటుంది, మీరు బాగుపడతారు, తరిస్తారు. సత్పురుషులతో స్నేహం ఎంతమంచిదో సత్పురుషులు కానివారితో స్నేహం అంతప్రమాదం. మనం ఆలోచన లేకుండా మాట్లాడకూడదు, ఆలోచనలేకుండా పని చేయకూడదు, ఆలోచన అమృతంతో సమానము. మనం సొంతంగా ఆలోచించుకోవడం నేర్చుకోవాలి. మనం ఇంట్లో పనుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటాము. కాని అన్నింటికంటే ముఖ్యమైనపని ఏమిటి అంటే, మొదటిపని ఏమిటి అంటే మనోనిగ్రహం. మన మనస్సును నియమించుకోవటానికి, మన మనస్సును అదుపులో ఉంచుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. నీ మనస్సును విరోధంగా పెట్టుకోవద్దు, నీ మనస్సును నువ్వు స్నేహితుడిగా చేసుకో అని భగవంతుడు గీతలో చెప్పాడు. మన మనస్సు మనకు అనుకూలంగా ఉంటే, మన మనస్సు శాంతిగా ఉంటే, నిర్మలంగా ఉంటే ఈ లోకంలో అందరూ నీకు విరోధులు అయినా వారు మనలను చేసేది ఏమీ లేదు. నీ మనస్సుకు కుదరులేకపోతే, నిర్మలత్వం లేకపోతే ఈ లోకంలో అందరూ నిన్ను సుఖపెట్టాలన్నా సుఖపెట్టలేరు. ఇటు మోక్షానికి, అటు బంధానికి కూడా నీమనస్సే కారణం. మనలోఏదో వెలితి ఉంది, అజ్ఞానంఉంది, పెద్దలను ఆశ్రయించి దానిని తెలుసుకొని దానిలోనుండి విడుదలపొందాలి అనికూడా కొంతమందికి తెలియదు. భగవంతుడు అందరిహృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు కాని ఆయన ఉన్నట్లు మనకు తెలియటంలేదు, దానికి ఎవరో కారణంకాదు మన స్వార్థమే కారణం. మానవుడికి ఎవడి స్వార్థం అంటే వాడికి బాగా ఇష్టం. మనం స్వార్థాన్ని త్యజించకపోతే జ్ఞానం కలుగదు. అయితే మనం ఒకేసారి స్వార్థాన్ని తగ్గించుకోలేము. ఆరోజుకారోజు, ఆజన్మకు ఆజన్మ స్వార్థాన్ని తగ్గించుకొంటూరావాలి. ఈ స్వార్థం శరీరంలో లేదు, చైతన్యంలో స్వార్థంలేదు. స్వార్థం నీ మనస్సులో ఉంది. మనస్సు బంగారం అయితే మనకు జ్ఞానం కలుగుతుంది. ఈ మనస్సు శరీరంతో కలిసిఉంటుంది. మీ ముక్కు బాగాలేదు అంటే మీ ముక్కు బాధపడదు, ముక్కుతో కలసిఉన్న మీ మనస్సు బాధపడుతుంది. ఇది శరీరంతో కలిసిఉంటుంది కాని శరీరంలో ఒక భాగంకాదు. అందుచేత శరీరం చనిపోయినప్పడు ఈ మనస్సు గారు చనిపోరు. మనస్సు ఉన్నంతకాలం నీకు శరీరాలు వస్తూ ఉంటాయి. శరీరం చనిపోయినప్పడు నీమనస్సు ప్రయాణం చేసి దాని వాసనను అనుసరించి, కర్మను అనుసరించి ఇంకో శరీరాన్ని ధరిస్తుంది. నీకు శవబుద్ధి ఉన్నంతకాలం శరీరాలు వస్తాయి, శివబుద్ధి కలిగితే ఇంక శవాలతో నీకు పనిలేదు. మనస్సును బాగుచేసుకోవటానికి, మనోనిగ్రహానికి గుడులు, గోపురాలు, తీర్థయాత్రలు, పూజలు, జపాలు, ధ్యానాలు, విచారణలు ఇవి అన్నీ మన పెద్దలు ఏర్పాటు చేసారు. మనం చేసే పని నిర్మలంగా, నిశ్చలంగా చేయాలి, గుర్తింపులు కోరుకోకూడదు. గుర్తింపులు కోరుకోవటం వలన వ్యక్తిభావన పెరుగుతుంది, గుర్తింపులు కోరుకోవటం మానివేస్తే మనస్సు చిరిగిపోతుంది. మనకు కామన్‌సెన్స్ చాలా ముఖ్యం. కామన్‌సెన్స్ ఉంటే వాడికి అవగాహనాశక్తి పెరుగుతుంది. అవగాహనాశక్తి ఎవడికైతే ఉందో వాడికి చైతన్యస్థాయి పెరుగుతుంది.

భగవాన్‌తో ఒక ప్లీడర్‌గారు మాట్లాడుతూ నాకు భయం వేస్తోంది. వయస్సు వచ్చి మీద పడుతోంది. ఇంతవరకు నేను ఏమీ సాధన చేయలేదు. మమకారం పోలేదు, రాగద్వేషములు పోలేదు. నాకు లోకం మీద మమత ఉంది. అందుచేత లోకం గుర్తుకువస్తోంది. భగవంతుడు మీద మమత లేదు అందుచేత భగవంతుడు గుర్తుకు రావటం లేదు, చావు దగ్గరకు వస్తోంది. చావు దగ్గరకు వచ్చినా పరవాలేదు చావుఅంటే భయం వేస్తోంది అన్నారు. నీవు చనిపోవటం ఏమిటి అన్నారు భగవాన్. నీ హృదయంలో ఒక చావులేని పదార్థంఉంది, అది నీవై ఉన్నావు. దానికి ఈ శరీరానికి ఎటువంటి సంబంధంలేదు. ఈశరీరం ఎలా వచ్చిందో అలాపోతుంది. అది నువ్వుకాదు. నేను చనిపోవాలి అనుకొన్నా నీకు చావు రాదు ఎందుచేతనంటే చావులేని వస్తువే నువ్వు.